క్లుప్తంగా

శిఖం భూమిని సందర్శించిన అధికారులు



భూమిని పరిశీలిస్తున్న అధికారులు

నందిగామ: మండల పరిధిలో ఉమ్మడి మామిడిపల్లి శివారులోని యెన్నెం చెరువు శిఖం భూమిని మండల అధికారులు గురువారం సందర్శించారు. శిఖం భూమిలో కొంత మంది ప్రీ కాస్ట్ ప్రహరీ వేశారనే సమాచారం మేరకు చెరువు శిఖం భూమిని సందర్శించినట్లు ఆర్ఐ రోజా తెలిపారు. మండల సర్వేయర్ భీమ్లా నాయక్, ఇరిగేషన్ ఏఈ కార్తీక్‌లతో పాటు సర్వే చేసినట్లు ఆమె వివరించారు. సర్వే నెంబర్లు 86, 87, 89లలోని భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు చెరువులో నీరు లేని సమయంలో, సుమారు ఒక ఎకర భూమిలో ప్రీకాస్ట్ వేసినట్లు గుర్తించినట్లు చెప్పారు. శిఖం భూమిలో వేసిన ప్రీ కాస్ట్‌ను తొలగించాలని సంబంధిత వ్యక్తులకు సూచించినట్లు ఆమె వివరించారు. లేనట్లయితే తామె తొలగిస్తామన్నారు.

సత్వరమే రోడ్డు పనులు పూర్తి చేయండి

కొత్తూరు: ఐదేళ్ల క్రితం ప్రారంభించిన కొత్తూరు-కుమ్మరిగూడ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని కుమ్మరిగూడ గ్రామస్తులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ విడతల వారీగా పనులు చేపట్టడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మొదటగా కొత్తూరు నుంచి ఎస్సీ కాలనీ వరకు సీసీరోడ్డు, తర్వాత కుమ్మరిగూడ నుంచి అక్కివానిగూడ, రైల్వే గోదాము వరకు విడతల వారిగా పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సీ కాలనీ నుంచి రైల్వే గోదాము వరకు పనులు పూర్తయినప్పటికీ అసంపూర్తిగానే ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శేషయ్య ఆశయ సాధనకు కృషి

పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పాతూరి వెంకట్‌రావు



నివాళులర్పిస్తున్న రైతులు

షాద్‌నగర్: పౌల్ట్రీ రైతు కీ.శే. ఎంపీ శేషయ్యను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పాతూరి వెంకట్‌రావు అన్నారు. పౌల్ట్రీ పితామహుడు శేషయ్య మూడో వర్ధంతిని గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో శేషయ్య నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో పౌల్ట్రీ రైతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేషయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మన్నవ శరత్‌కుమార్, మాజీ రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, రైతులు పాతూరి సత్యనారాయణ, వసంతరావు, మలినేని సాంబశివరావు, శ్రీను, మక్కపాటి మల్లేశ్వరరావు, సతీష్, నాగేశ్వర్‌రావు, రాజేంద్రప్రసాద్, రఘు, కృష్ణారావు, సురేష్, సత్యనారాయణ, సంజీవరావు, ప్రభాకర్, కోటేశ్వర్‌రావు, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇన్‌స్పెక్టర్ ప్రసాద్



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

నందిగామ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. నందిగామలో నిర్వహిస్తున్న ఎన్‌పీఎల్ క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం ప్రెస్, పోలీస్ మరియు విక్టరీ జట్టులకు మ్యాచ్ నిర్వహించారు. ఈ పోటీలను ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహ భావంతో పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో విజేతలైన టీంలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, ఎంపీటీసీ సభ్యుడు చంద్రపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా షబ్ ఎ మెరాజ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని జామై మసీదుతో పాటు అన్ని మసీదుల్లో బుధవారం రాత్రి షబ్ ఎ మెరాజ్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పట్టణంలోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా మసీదుల్లో ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు.

అనుమతుల్లేకుండా నిర్మాణాలు!

- చోద్యం చూస్తున్న అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి రూ. లక్షల్లో గండి
- నోటీసులు ఇచ్చినా ఆగని పనులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కొనసాగుతున్న అక్రమ నిర్మాణపనులు

నందిగామ: ఏదైన చిన్నపాటి ఇళ్లు నిర్మించుకుంటుంటేనే అధికారులు అనేక రకాల ప్రశ్నలు వేస్తారు. సంబంధిత కాగితాలను అడుగుతారు. వారు అడిగిన ఏ ఒక్క పేపరు అందుబాటులో లేకపోతే వెంటనే నిర్మాణ పనులు నిలిపివేస్తుంటారు. కానీ మండల కేంద్రమైన నందిగామలో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. దీంతో ప్రభుత్వాదాయానికి రూ. లక్షల్లో గండి పడుతుంది. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. నందిగామ పరిధిలోని పాత జాతీయ రహదారి చంద్రాయాన్ గూడ నుంచి మామిడిపల్లి వెళ్లే రహదారికి ఆనుకొని సర్వే నెంబరు 1435లో గతంలో అక్కడ ఒక చిన్న పరిశ్రమ ఉండేది. దాని వెనకాలే ఇటీవల అతిపెద్ద పరిశ్రమ నిర్మాణ పనులు జోరుగా కొనసాగిస్తున్నారు. ఈ పరిశ్రమ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి పగలు తేడా లేకుండా నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ విషయంలో ఏ ఒక్క అధికారి కూడా అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. గ్రామంలో ఏ ఒక్క చిన్న నిర్మాణ పనులు చేసినా హుటా హుటిన సంబంధిత అనుమతి పత్రాలను అడిగి తీసుకుంటారు. అనుమతులు లేనట్లయితే పనులను నిలిపివేయించే అధికారులు ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణంలో ఏమాత్రం తమకు తెలియదన్నట్లు వ్యవహరించడం బాధాకరం.

నోటీసులను పట్టించుకోని వైనం

ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన పన్నులను వసూలు చేయాల్సిన అధికారులు ఇక్కడ నిరంతరంగా పనులు జరుగుతున్నా కూడా చూసి చూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన వస్తున్నాయి. అక్రమ నిర్మాణానికి సంబంధించి గ్రామ పంచాయతీ అధికారులు గత నెల 31న సంబంధిత యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఐనప్పటికి వారు నిర్మాణ పనులను యథేచ్ఛగా చేపడుతున్నారు.
ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనులు చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రామ కార్యదర్శి జారీ చేసిన నోటీస్

చర్యలు తీసుకుంటాం

మామిడిపల్లి రోడ్డులో అనుమతులు లేకుండా పరిశ్రమ నిర్మిస్తున్నారనే విషయం వాస్తవమే. మాకు ఇటీవలే తెలిసింది. దీంతో వెంటనే గత నెల 31న నోటీసులు జారీ చేశాం. నిర్మాణ పనులు నిలిపి వేయించాం. 10 రోజుల్లో సమాధానం రానట్లయితే మరో నోటీసు జారీ చేస్తాం. తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున రెడ్డి, గ్రామ కార్యదర్శి, నందిగామ

పంచాయతీగా ఏర్పాటు చేయాలి

ఎంపీడీఓ, కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌లకు గ్రామస్తుల వినతి



భీంభరత్‌కు వినతి పత్రం అందిస్తున్న ధర్మసాగర్ గ్రామస్తులు

చేవెళ్ల: ధర్మసాగర్‌ను ప్రత్యేక పంచాయతీగా మార్చాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీడీఓ, నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం గ్రామస్తులంతా కలిసి ఎంపీడీఓను, భీంభరత్‌ను వేరువేరుగా కలిసి ధర్మసాగర్‌ను పంచాయతీగా చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 500లకుపైగా ఓట్లు, 1000 మంది జనాభా ఉందన్నారు. తమ గ్రామాన్ని పంచాయతీగా చేయాలని పలు మార్లు ఫిర్యాదులు చేశామని గుర్తు చేశారు. గొల్లపల్లి గ్రామానికి అనుబంధ గ్రామంగా ఉన్న తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గతంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గంలో తీర్మాణం చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు చెప్పారు. ఈ విషయంలో సత్వరమే స్పందించాలన్నారు. అనంతరం పామెన భీంభరత్ ఈ విషయంలో చర్యలు తీసుకుంటానన్నారు. దీని గురించి తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాట్లాడుతానన్నారు. ఎంపీడీఓ హిమబిందుతో ఫోన్‌లో మాట్లాడి సంబంధిత ఫైల్ సిద్ధం చేసి పంపించాలని ఆయన కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ సీనియర్ నాయకుడు ఇస్నాతిశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు వ్యాపించి రోగాల బారిన పడతారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయకుమారి, అరుణ్‌కుమార్, వినోద్‌కుమార్‌రెడ్డి, మల్చలంమురళి, సాయిక్రిష్ణ, నారాయణ, రమేష్, అశోక్, గంగాధర్, మల్లేష్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా అతిథి గృహం!

పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: పంచాయతీ రాజ్ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటుంది. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పంచాయతీ రాజ్ అతిథి గృహం అధ్వాన్నంగా తయారైంది. పదేళ్ల క్రితం వరకు మండల మహిళా సమాఖ్య కార్యకలాపాలన్నీ ఈ భవనంలోనే జరిగేవి. దీన్ని మహిళా సమాఖ్య కోసం నిర్మించిన అది సరిపోకపోవడంతో ఎదురుగా మరో భవనాన్ని నిర్మించారు. ఈ భవనం వృథాగా ఉండటంతో పదేళ్ల క్రితం అప్పటి జెడ్పీటీసీ సభ్యుడు చంద్రలింగంగౌడ్ ఈ భవనాన్ని పంచాయతీ రాజ్ అతిథి గృహంగా మార్చారు. జిల్లా పరిషత్ నిధులతో ఈ భవనానికి మరమ్మతులు చేయించి సొంత నిధులతో ఫర్నీచర్ సమకూర్చారు. అతిథి గృహంగా ఏర్పాటైన తరువాత కొద్ది రోజులు మాత్రం దీన్ని ఉపయోగించుకున్నారు. ఆ తరువాత దీన్ని వాడుకోకపోవడంతో వృథాగా వదిలేశారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఈ భవన నిర్వహణను గాలికొదిలేశారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి దీన్ని ఏర్పాటు చేస్తే అది ఎవరికీ అక్కరకు రాకుండా తయారైంది. దీనిపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి అతిథి గృహాన్ని వినియోగంలో తేవాలని పలువురు కోరుతున్నారు.

పైపులైన్ల లీకేజీ.. రోడ్లు జలమయం

ఇబ్బందుల్లో స్థానికులు



హిమాయత్‌నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్ననీరు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో మంచినీటి పైపులైన్‌లు లీకేజీ కావడంతో ఆ నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. ఈ విషయంలో వాహనాదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధుల కాలం ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన ఆరు రోజుల క్రితం ప్రారంభమైంది. హిమాయత్‌నగర్ గ్రామంలోని సాయిబాబా కాలనీ దాదూ మందిర్ ఎదురుగా మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో ఆ నీరు రోడ్డుపై పారి జలమయంగా మారింది. దీంతో ఈ నీరంతా హైవే రోడ్డు, చిలుకూరు బాలాజీతో పాటు తంగడిపల్లి, వికారాబాద్ వెళ్లే రహదారులపై నీరు చేరింది. బాలాజీ దేవాలయానికి వెళ్లే భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక అధికారుల పాలన ఇదేనా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయం అధికారులు స్పందించి లీకేజీలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని స్థానదికులు కోరుతున్నారు.

విజృంభిస్తున్న దోమలు, ఈగలు



హిమాయత్‌నగర్ గ్రామంలో సాయిబాబా దేవాలయ ప్రాంతంలో మంచినీటి పైపులైన్ పగిలి నీరంతా బాలాజీ దేవాలయానికి వెళ్లే రహదారిపై ప్రవహిస్తుంది. ఈ దేవాలయానికి వెళ్లే భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఈ రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిలో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోని ప్రజలకు సమస్యలు రాకుండా పరిష్కరించాలి.

–బీన నర్సింహ్మా, శాంతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు

గ్రామస్తుల సహకారం మరువలేం

పలుగుట్టలో పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు

చేవెళ్ల: గ్రామస్తుల సహకారం మరువలేమని పలుగుట్ట మాజీ సర్పంచ్, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం జనార్ధన్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామంలో గురువారం గ్రామస్తులు అంతాకలిసి పంచాయతీ పాలకవర్గం సభ్యులు పదవీ కాలం ముగియడంతో వారికి ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి శిరీష, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనేప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కార్యదర్శి రాంరెడ్డి, నర్సింలు తదితరుల ఆధ్వర్యంలో సన్మానం, వీడ్కోలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించి తనను ముందుకు నడిపించిన గ్రామ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని చెప్పారు. గ్రామంలో తన వంతుగా చేయాల్సిన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంవలో నర్సింహ్మారెడ్డి, బుచ్చిరెడ్డి, క్రిష్టారెడ్డి, కార్యదర్శి నరేశ్‌గౌడ్, మండల కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, చల్మారెడ్డి, గ్రామస్తులు ఎంమనోహర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.



సన్మానించిన గ్రామస్తులు, నాయకులు

ఆర్థిక సహాయం అందజేత

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని విద్యాభాసానికి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆర్థిక సహాయం అందజేశారు. హర్షిత పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒకేషనల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. పేద కుటుంబానికి చెందిన హర్షిత ఆర్థిక పరిస్థితి బాగలేక కళాశాల ఫీజు కట్టలేక ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న యూత్‌కాంగ్రెస్ నాయకులు కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులకు హర్షిత ఫీజును అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆంజనేయులు మాట్లాడుతూ యువకులు సామజిక సేవలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింటూరెడ్డి, కోశాధికారి మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పాలు, పండ్లు పంపిణీ

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ మంజుల, లయన్స్‌క్లబ్ చైర్మన్ రమేశ్ పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డికి షోకాజ్ నోటీస్

చేవెళ్ల: కాంగ్రెస్ పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో పార్టీకి వ్యతిరేకంగా అతను పనిచేసినట్లు ఆ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. అతనికి గత నెల 23వ తేదీన ఈ నోటీసును పార్టీ అధిష్టానం జారీ చేసింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నోటీస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. చేవెళ్ల నియోజకవర్గం, షాబాద్ మండలానికి చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పీసీసీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాడు. ఇతనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరుడిగా పేరుంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌ను ఓడించేందుకు పార్టీ నిబంధనలను అతిక్రమించి వ్యతిరేకంగా పనిచేసినట్లు ఫిర్యాదులు అందినట్లు ఆ ఉత్తర్వులో ఉంది. ఈ విషయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ మంత్రి, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ద్వారా గత నెలలో ఈ షోకాజ్‌నోటీస్ జారీ అయ్యింది. దీనిపై మధుసూదన్ రెడ్డి పార్టీకి సమాధానం ఇవ్వాలని లేని పక్షంలో చర్యలు ఉంటాయని ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే ఈ షోకాజ్ నోటీస్ అందిన విషయం ఇప్పటి వరకు బయటకు రానివ్వలేదు. ఇప్పుడు ఇది బయటకు రావడంతో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో అంతా దీనిపై చర్చించుకుంటున్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

సీనియర్ నాయకుడు మహేశ్



ఆర్థిక సహాయం అందజేస్తున్న మళ్లీ మహేశ్

0షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మళ్లీ మహేశ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన ఖాజామీయా అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉండే పేదల కుటుంబాలకు తన వంతు ఆర్థిక సహాయం ఇచ్చి ఆదుకుంటామని తెలిపారు. తాను సంపాదించిన దాంట్లో కొంత మృతుల కుటుంబాలకు ఖర్చు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చాంద్‌పాషా, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు ఇంటింటి సర్వే



సిబ్బంది పని తీరును పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్

చేవెళ్ల: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. అర్హులైన అందరికీ ఈ పథకం వర్తింపచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకన్న పేర్కొన్నారు. గురువారం చేవెళ్లలో సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది పనితీరును ఎస్ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరాలు ఎలా సేకరిస్తున్నారు? సంబంధిత విషయాలను ఎలా నమోదు చేస్తున్నారనే వాటిని వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ సర్వే వివరాలను ప్రభుత్వానికి అందించాల్సి ఉందని అప్పటి లోగా సిబ్బంది వివరాల సేకరణ పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల ఇంటికొచ్చే తమ సిబ్బందికి ప్రజా పాలన దరఖాస్తు చేసుకున్న నెంబర్‌తోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్లను అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏడీ స్వామి, ఏఈ జానీమోహినుద్దీన్, లైన్‌మెన్ పులయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవి, వంశీచంద్‌రెడ్డిని గెలిపిస్తాం

తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపించుకుంటామని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి మల్లు రవి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి వంశీచంద్‌రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించాలని పార్టీ అధిష్టానానికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో కేశవరెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి మల్లు రవి, చల్లా వంశీచంద్‌రెడ్డి సేవలు చాలా అవసరమని తెలిపారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన

గ్రామాల్లో గావ్ చలో గర్ చలో



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా? లేదా అనే విషయాలపై అవగాహన కల్పించడమే 'గావ్‌చలో గర్ చలో' అని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం చేవెళ్ల మండలంలోని కందవాడ, దేవరంపల్లి, ఈర్లపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు ప్రజల ఇంటి వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు అంతా వారికి కేటాయించిన గ్రామాల్లో తిరుగుతూ వారితో కలిసి ఉంటూ అక్కడే బస చేస్తున్నట్లు చెప్పారు. ఇది పార్టీ పటిష్టతకు ఎంతో మేలు చేస్తోందని తెలిపారు. దేవరంపల్లిలో బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శి ఎం. మధుకర్‌రెడ్డి, ప్రకాశ్, అనంద్‌గౌడ్, ఈర్లపల్లిలో జి. నితీష్‌రెడ్డి, మణికంట, శ్రీనాథ్, కందవాడలో సీనియర్ నాయకులు ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, క్రిష్టాగౌడ్ పాల్గొన్నారు.